# విదేశీయులను ఆకర్షిస్తున్న పాలమూరు

- సీఎం కేసీఆర్ కృషితోనే సాధ్యమైంది
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- విదేశీ మహిళలతో కలిసి బైక్‌రైడింగ్
- రాష్ట్రంలో 9 రోజుల పాటు పర్యటన




బైపాస్ రోడ్డులోని హ్యాండ్ ఫౌంటేన్ వద్ద బైక్ రైడర్స్‌తో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 14 : ఒకప్పుడు తాగునీటి కోసం అవస్థలు పడిన మహబూబ్‌నగర్.. నేడు విదేశీ పర్యాటకులను సైతం ఆకర్షిస్తున్నదని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ సహకారంతో మహబూబ్‌నగర్‌ను అద్భుతంగా తీర్చిదిద్దడం వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు. ఫ్రెంచ్ మోటర్ సైక్లిస్ట్ ఆలిసన్ గ్రున్ ఆధ్వర్యంలోని ఫ్రీ డబ్ల్యూ వేదిక ద్వారా ఫ్రాన్స్, అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, సింగపూర్, థాయిలాండ్‌కు చెందిన 8 మంది బైక్‌రైడర్లు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న యాత్రను జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం వారితోపాటు బైక్ రైడింగ్ చేశారు. బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన హ్యాండ్ ఫౌంటేన్ కూడలి వద్ద ఫొటో దిగారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక అవకాశాలు అందిస్తూ అసాధారణమైన మోటర్ సైక్లింగ్ అనుభవాలను కల్పించేందుకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునేందుకు ఫ్రీడబ్ల్యూ చేస్తున్న ప్రయత్నం చాలా గొప్పదన్నారు. మహిళలు, పురుషులు అనే వివక్ష లేని సమాజం రావాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం తెలంగాణ, మహబూబ్‌నగర్ విదేశీ స్వర్గధామంగా మారిందన్నారు. రైడర్లు అలిసన్ గ్రున్, స్వెడైన్, ఆస్లీ, జనెల్లి, జువేనా, స్టాసి, లారీ, సిగ్రిడ్, రచన బైక్ రైడింగ్ ద్వారా మహబూబ్‌నగర్, వికారాబాద్, నిర్మల్, వరంగల్, పోచంపల్లి మీదుగా హైదరాబాద్ చేరుకుంటారని తెలిపారు. ఎనిమిది మంది బైక్‌రైడర్లు 9 రోజులపాటు బతుకమ్మ సంబురాలు, పర్యాటక ప్రదేశాలు సందర్శించడంతోపాటు కళాకారులు, చేనేత కార్మికులను కలుస్తారన్నారు. ఈ పర్యటనకు హైదరాబాద్‌కు చెందిన మోవో సంస్థ ఫౌండర్ జైభారతి మార్గనిర్దేశం చేస్తున్నారన్నారు. మహబూబ్‌నగర్‌లో జంగల్ సఫారీ, కేసీఆర్ ఎకో అర్బన్ పార్క్, శిల్పారామం, నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్, సస్పెన్షన్ బ్రిడ్జి, మన్యంకొండ ఆలయం సహా అనేక పర్యాటక ప్రాంతాలు ఎంతగానో ఆకర్షిస్తున్నాయని విదేశీ మహిళా బైక్ రైడర్లు పేర్కొన్నారు.

***స్త్రీ శక్తి అవార్డ్స్ పోస్టర్ ఆవిష్కరణ..***

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 14 : ఈ నెల 17న తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న సంధ్య కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న 6వ ఎడిషన్ స్త్రీ శక్తి అవార్డ్స్‌కు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి విడుదల చేశారు. దేశంలోని వివిధ రంగాల్లో పేరు ప్రఖ్యాతలు గడించిన మహిళలకు ఈ అవార్డు అందజేయడంపై అభినందనలు తెలిపారు.



స్త్రీ శక్తి అవార్డు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

***పాటల సీడీ ఆవిష్కరణ..***

మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన అభివృద్ధిపై రూరల్ మండలం మాచన్‌పల్లి గ్రామానికి చెందిన రవి స్వయంగా రచించి పాడిన 'తల్లిలాంటి పల్లె.. ఒడిని కాపాడగా కదిలెరా' పాటల సీడీని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం గాయకుడు రవిని మంత్రి అభినందించారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే పాపమే..

- 70 ఏండ్లు పాలించి తాగునీరు కూడా ఇవ్వలేదు
- ఎరువులు ఇవ్వని వారు ఓట్లెలా అడుగుతారు?
- భవిష్యత్ కోసం బీఆర్ఎస్‌ను గెలిపించాలి
- జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

నవాబ్‌పేట, అక్టోబర్ 14 : రాష్ట్రాన్ని 70 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు కనీసం తాగునీరు కూడా ఇవ్వలేదని, వారికి ఓటేస్తే పాపమే తగులుతుందని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహ రైస్ మిల్ ఆవరణలో శనివారం బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులతో సీఎం సభ ఏర్పాట్లపై శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ సమైక్య పాలనలో తాగునీటి కోసం ప్రజల నుంచి వచ్చే ఒత్తిడి తట్టుకోలేక సర్పంచులు తీవ్ర ఇబ్బందులు పడేవారని ఇప్పుడు అలాంటి పరిస్థితులు ఎక్కడా లేవన్నారు. రైతులకు కనీసం ఎరువులు కూడా ఇవ్వలేని కాంగ్రెస్ దద్దమ్మలు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరడం హాస్యాస్పదమన్నారు. పోలీసుల పహారాలో ఎరువులు పంపిణీ చేసిన సంగతి మరిచిపోవాలా..? అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామాల్లో రోడ్లన్నీ బీటీ, సీసీలుగా మారాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జడ్చర్ల నియోజకవర్గంలోని 200 తండాల్లో కేవలం 2 చోట్ల మాత్రమే వాటర్ ట్యాంకులు ఉండేవని, ఇప్పుడు ప్రతి తండాలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి దాహార్తి తీరుస్తున్నామన్నారు. భవిష్యత్ తరాల కోసం మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం గెలవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర సాధన కోసం తాను ఎమ్మెల్యే పదవినే త్యాగం చేశానని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమంత్రి అభ్యర్థే గతి లేదని.. ఇక ఆరు గ్యారెంటీ స్కీంల కథ దేవుడెరుగని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా రెపరెపలాడాలని, లేదంటే గాడి తప్పి ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. నవాబ్‌పేట మండలం నుంచి గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 8 వేలపై చిలుకు ఓట్ల మెజార్టీ వచ్చిందని.., ఈ సారి 20 వేల మెజార్టీ ఇవ్వాలని కోరారు. 18న జడ్చర్లలో నిర్వహించే సీఎం కేసీఆర్ సభకు మండలం నుంచి భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం కేశరావుపల్లి గ్రామానికి చెందిన 40 మంది, దర్పల్లికి చెందిన 15 మంది, కాకర్లపహాడ్‌కు చెందిన 10 మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశంలో ఎంపీపీ అనంతయ్య, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, వైస్ చైర్మన్ చందర్‌నాయక్, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శీనయ్య, మాజీ జెడ్పీటీసీలు ఇందిరాదేవి, స్వరూప, మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, సర్పంచులు గోపాల్‌గౌడ్, సత్యం, యాదయ్య, వెంకటేశ్, నాయకులు రాంప్రసాద్, పురుషోత్తం, నాగిరెడ్డి, కృష్ణగౌడ్, సంజీవరెడ్డి యూత్‌వింగ్ అధ్యక్షుడు శ్రీను తదితరులున్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన కేశరావుపల్లి కాంగ్రెస్ కార్యకర్తలతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికే ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న శేరిపల్లి గ్రామస్తులు


# ఎమ్మెల్యే 'ఆల' వెంటే మేమంతా..

- మూకుమ్మడిగా తీర్మానం చేసిన శేరిపల్లి గ్రామస్తులు

భూత్పూర్, అక్టోబర్ 14 : ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వెంటే ఉంటామని మండలంలోని శేరిపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు మూకుమ్మడిగా తీర్మానం చేశారు. కారు గుర్తుకే ఓటేస్తామని ఏకగ్రీవంగా ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలోని అన్ని కులాలకు చెందిన నాయకులు సర్పంచ్ బోల శేఖర్, బీఆర్ఎస్ నాయకుడు వెంకట్రాములు ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ సమక్షంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ తమ గ్రామంలో 30–40 ఏండ్ల కిందట ఫ్యాక్షన్ రాజకీయాలు ఉండేవన్నారు. ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గ్రామ రూపురేఖలు మారాయన్నారు. నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసి రూ.20 లక్షలతో జీపీ భవనం మంజూరు చేశారన్నారు. జాతీయ రహదారి నుంచి శేరిపల్లి మీదుగా హస్నాపూర్‌కు రూ.2.75 కోట్లతో బీటీ రోడ్డును మంజూరు చేయగా, పనులు పూర్తయ్యాయన్నారు. అదేవిధంగా గ్రామంలో రూ.35 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, చేపల కోసం రూ.25 లక్షలతో చెరువులో పూడిక తీశారని చెప్పారు. మత్స్యకారుల భవనం కోసం రూ.15లక్షలను మంజూరు చేయగా, పనులు జరుగుతున్నాయి. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేలా కృషి చేస్తున్న సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికే ఓటేస్తామని చెప్పారు.

# పేలుడు పదార్థాల కలకలం

- జడ్చర్లలో 1,600 జిలెటిన్ స్టిక్స్, 300 డిటోనేటర్లు స్వాధీనం



పట్టుబడిన జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్లు

జడ్చర్ల టౌన్, అక్టోబర్ 14 : జడ్చర్ల పట్టణంలో పేలుడు పదార్థాలు కలకలం సృష్టించాయి. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని జయప్రకాశ్ నగర్ కాలనీలోని ఓ ఇంట్లో పేలుడు పదార్థాలు నిల్వ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు శనివారం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, జడ్చర్ల ఎస్సైలు చంద్రమోహన్, నాగరాజు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. 11 బాక్సుల్లో 1,600 జిలెటిన్ స్టిక్స్, 300 డిటోనేటర్లు, రెండు బెండల్స్ ఎక్స్‌టెన్షన్ వైర్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.80 వేలకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. నల్లగొండ జిల్లా జనగామ మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన ప్రశాంత్, తిప్పర్తి మండలానికి చెందిన సుధాకర్‌రావు పేలుడు పదార్థాలను నిల్వ ఉంచినట్లు గుర్తించారు. వీరిద్దరూ బండరాళ్లను పగులగొట్టేందుకు వీటిని సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

# ఆత్మకూరు వాసికి 'జర్మనీ' డాక్టరేట్



రవిశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు, అక్టోబర్ 14 : జర్మనీకి చెందిన ప్రముఖ పరిశోధనా విశ్వవిద్యాలయం నుంచి ఆత్మకూరు వాసి డాక్టరేట్ అందుకున్నారు. పట్టణానికి చెందిన పీవీ.రవిశేఖర్‌రెడ్డికి ఇంటర్నేషనల్ పీస్ (అంతర్జాతీయ శాంతి) అంశంలో సామాజికంగా చేసిన సేవకుగానూ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కరోనా సమయంలో నిరుపేదలకు అన్నదానం, ఇంటింటికీ బ్లీచింగ్, పారిశుధ్య చర్యలు, మొక్కలు నాటడం, సంరక్షించడం వంటి కార్యక్రమాలను గుర్తించి విశ్వవిద్యాలయం వారు ఇంటర్నేషనల్ పీస్‌గా గుర్తించి డాక్టరేట్‌ను ప్రకటించారు. పాండిచ్చేరిలోని పల్లడం రోడ్ ఇండోర్ స్టేడియంలో ప్రముఖ సంఘ సంస్కర్త రోహిణీ దీక్షిత్ చేతులమీదుగా రవిశేఖర్‌రెడ్డి డాక్టరేట్ అందుకున్నారు.